మట్టితోనే మనుగడ

- ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు
- ఎకో ఫ్రెండ్లీ ప్రతిమలను వాడాలని సూచిస్తున్న అధికారులు
- జోరుగా మట్టి విగ్రహాల పంపిణీ



ఏలేశ్వరంలో మట్టివినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎస్సై రామలింగేశ్వరరావు

ఏలేశ్వరం: పర్యవరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మట్టివినాయక విగ్రహాలను పూజించాలని ఎస్సై రామలింగేశ్వరరావు సూచించారు. మార్స్ కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద గురువారం ఎస్సై రామలింగేశ్వరరావు, ఎస్ఎస్ఎస్ పీఠ ప్రగడ ప్రయాగమూర్తి ఆధ్వర్యంలో సుమారు 700 మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యవరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను మాత్రమే వాడాలన్నారు. మట్టివినాయక విగ్రహాల ద్వారా ఎటువంటి పర్యవరణ ముప్పు ఉండదన్నారు. పర్యవరణాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కోరాడ రాజు, దాడిశెట్టి వీరబాబు, మనోహర్, సత్య, యమునా ప్రియ, వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ

తుని: వినాయక చవితి ఉత్సవాలకు ప్రతిఒక్కరూ మట్టితో తయారు చేసిన విగ్రహాలనే ఉపయోగించాలని వాకర్స్ హెల్త్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు కోరారు. స్థానిక ఫీడర్ రోడ్డులో పలువురికి గురువారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణానికి హాని కలుగుతుందని వాకర్స్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ అన్నారు. జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, తుని శాఖ అధ్యక్షుడు మూర్తి, సత్య సాయి, కండవల్లి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధ్వర్యంలో...

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఆనూరులో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ కెరీర్ గైడెన్స్ డి.కోషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎం.రఘునాథ్, చిట్టూరి రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆనూరులో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు



తునిలో మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తుని: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ కె. శ్రీలత అన్నారు. స్థానిక అమ్మాజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పౌష్టికాహారం తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

10న మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ గురువారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను 73827 81490 నంబరుకు ఫోన్ చేసి తెలియ పరచాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కత్తిపూడిలో ఫీవర్ సర్వే చేస్తున్న డాక్టర్ అర్చన, ఆరోగ్య సిబ్బంది

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రావికంపాడు పీహెచ్‌సీ వైద్యురాలు కె.అర్చన సూచించారు. మండలంలోని కత్తిపూడి పంచాయతీ కొండవారిపేటలో గురువారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

హాస్టళ్లలో తనిఖీలు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులోని బీసీ బాలికల వసతి గృహం, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలను ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు గురువారం తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలు, రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు కలుషితంగా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు.

సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: గ్రామానికి చెందిన అద్దాల రత్నరాజును సారాతో అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. రౌతులపూడి శివారు హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వెనుక సారా కాస్తుండగా రత్నరాజును పట్టుకున్నామని తెలిపారు. అతని నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినటు తెలిపారు.

వరద బాధితులకు పండ్లు, ఆహారం అందజేత

తొండంగి: విజయవాడలో వరద బాధితులకు స్ఫూర్తి ఫౌండేషన్ సాయం అందించింది. వేమవరానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 2 వేల మందికి భోజనం, వాటర్ ప్యాకెట్లు, పండ్లు ఏర్పాటు చేశారు. వీటిని గురువారం ప్రత్యేక వాహనాల్లో విజయవాడ తరలించి వరద బాధితులకు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీను, బచ్చు వీరవెంకట సత్యనారాయణ(చిన్ని), బెక్కం శ్రీను, తేజ, గంగాధర్ పాల్గొన్నారు.

రాజపూడిలో సామూహిక సీమంతాలు

జగ్గంపేట: మండలంలోని రాజపూడి చల్లా నాగేశ్వరరావు కల్యాణ మండపంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ జగ్గంపేట సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 43 మంది గర్భిణులను సత్కరించి, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.రమేష్, ఎంపీడీఓ వసంతకుమార్, గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు పాల్గొన్నారు.


రాజపూడిలో సామూహిక సీమంతాలు చేసిన ఐసీడీఎస్ అధికారులు

టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన బాధితులకు పరామర్శ


తుని ఏరియా ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని యర్రయ్యపేట పంచాయతీ కొత్తపేటలో టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన బాధితులను గురువారం తుని ఏరియా ఆస్పత్రిలో వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు మురాలశెట్టి సత్యనారాయణ, చొక్కా కోదండ తదితరులు పరామర్శించారు. తమ పార్టీ వారిపై టీడీపీ శ్రేణుల దాడిని ఖండించారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీపరంగా బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

గురుకుల పాఠశాలకు ఇన్వెర్టర్ వితరణ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలకు గోకవరం విశాల సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు తన మిత్ర బృందంతో కలిసి రూ.2.50 లక్షల విలువైన ఇన్వెర్టర్‌ను అందజేశారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాలలో తరచూ విద్యుత్ సమస్య తలెత్తడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గళ్లా రాము ద్వారా విషయం తెలుసుకున్న సత్తిబాబు ఇన్వెర్టర్‌ను సమకూర్చగా గురువారం స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. అనంతరం దాతను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రవి, సర్పంచ్ అడపా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


దాత సత్తిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని మల్లేపల్లి వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... జగ్గంపేటకు చెందిన పినమరెడ్డి రాజబాబు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మండలంలోని మల్లేపల్లి వద్దకు వచ్చే సరికి ఎం.శ్రీను అనే వ్యక్తి మరో బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు

- జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి
- పలు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు

జగ్గంపేట: వరిలో మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే పంటకు నష్టం కలుగుతుందని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి తెలిపారు. మండలంలోని గొల్లలగుంటలో గురువారం ఏఓ రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అధిక ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో ఎరువుల యాజమాన్యం సక్రమంగా నిర్వహిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. పక్షి స్థావరాలు ఏర్పాటు, పసుపు రంగు జిగురు అట్టల వినియోగం తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. పొలం గట్లపై బంతి, వంగ, కంది సాగుతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ రఘు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


గొల్లలగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమగ్ర నీటి యాజమాన్యంపై అవగాహన

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో గురవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సమగ్ర నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి మాట్లాడుతూ చిరుపొట్ట దశలో కచ్చితంగా నీటి మట్టం 5 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. పిలకల దశలో నీరు (2 సెంటి మీటర్లు) తక్కువగా ఉండడం ద్వారా దుబ్బు ఎక్కువ పిలకలు వేస్తుందన్నారు. ప్రతి 25-30 రోజుల మధ్యలో మూడు రోజులు నెర్రలు వచ్చేలా ఆరుతడిగా ఉంచడం ద్వారా నేల లోపల ఉన్న హానికర గ్యాస్ బయటకు పోతుందన్నారు. దీని ద్వారా పైరుకు గాలి తగిలి బాగా ఎదుగుతుందన్నారు. దుబ్బు పిలకలు ఎక్కువగా వేసి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన

గండేపల్లి: గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారులు రైతులకు ఎరువులు-జీవన ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏఓ-సంజీవ్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానం, కత్తిపూడి విద్యుత్ సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ కె. రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నవరం దేవస్థానం, అన్నవరం, గోపాలపట్నం, తేటగుంట, బెండపూడి, ఎ.కొత్తపల్లి, రావికంపాడు, పీఈ చిన్నాయపాలెం, కత్తిపూడి, తమ్మయపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నిందితుడికి ఏడాది జైలు

కోటనందూరు: పంట భూమి కొట్లాట విషయంలో నిందితుడికి ఏడాది జైలు, రూ. 10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2020లో రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామానికి చెందిన కరగాని అప్పారావు అనే రైతు తన పొలంలో మొక్కలు నాటారు. అదే మండలం ఉప్పంపాలేనికి చెందిన సుర్ల రాంబాబు మొక్కలు నాటిన పొలం తనదని వాదనకు దిగి అప్పారావును కొట్టి గాయపరిచాడు. బాధిత రైతు కరగాని అప్పారావు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేయగా గురువారం కేసు విచారణకు వచ్చింది. తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుర్ల రాంబాబును నిందితుడిగా నిర్ధారించి శిక్ష విధించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

నిండుకుండలా ఏలేరు

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న నీరంతా జలాశయానికి వచ్చి చేరుతోంది. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా పడుతుండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు గణనీయంగా పెరిగాయి. ప్రాజెక్టులో గురువారానికి 86.56 మీటర్లకు గాను 84.61 మీటర్లు, 24.11 టీఎంసీలు గాను 20.25 టీఎంసీలకు చేరుకున్నాయి. దీంతో ఆయకట్టుకు 1500, విశాఖకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షపాతం ఎక్కువగా ఉండడంతో దిగువ ఆయకట్టు, పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.


ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు

రత్నగిరిపై భక్తులకు ఇక్కట్లు

అన్నవరం: సుమారు రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షం కారణంగా రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకూ కుండపోత వర్షం కురిసింది. దేవస్థానం ఘాట్‌రోడ్డు, మెట్లదారి, ఆలయ ప్రాంగణం జలమయమయ్యాయి. మెట్ల దారి, ఘాట్ రోడ్డులో భారీగా నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రామాలయం వద్ద గల విశ్రాంతి షెడ్డు కింద పలువురు భక్తులు తలదాచుకున్నారు.


దేవస్థానం ఘాట్‌రోడ్‌లో ప్రవహిస్తున్న నీరు

1238 క్యూసెక్కుల విడుదల

కోటనందూరు: తాండవ జలాశయం స్పిల్ వే గేట్లు ఎత్తి 1238 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు డీఈఈ పి.అనురాధ గురువారం తెలిపారు. ఆయకట్టు అవసరాలకు ఎడమ ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 60 కూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామన్నారు. జలాశయానికి 225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకూ సముద్రానికి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. తాండవ నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


తాండవ స్పిల్‌వే గేట్ల ద్వారా విడుదల చేసిన నీరు

ఆచార్య దేవోభవ !

- ఘనంగా టీచర్స్ డే
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం
- పాఠశాలల్లో గురువులకు సత్కారం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న ఆకెళ్ల శ్రీవాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఆమె జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

అజ్ఞానాన్ని తొలగించేవారు గురువులు

ప్రత్తిపాడు రూరల్: అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని అందించే వాడు గురువు మాత్రమేనని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్తిపాడులో గురువారం జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అన్నపర్తి శ్యామల కుమారి, కామరాజు దంపతులను యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాని జ్ఞాపికను అందజేశారు.


ఏలేశ్వరంలో సర్వేపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అధికారులు

ఏలేశ్వరం: భారత మాజీ రాష్ట్రపతి, ఉత్తమ గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దైవం తరువాత గురువులకే ఆ స్థానం ఉందన్నారు. గురువులను గౌరవించడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఎంపీడీఓ జె.శ్రీనివాస్, ఎంఈఓ అబ్బాయి, విద్యాశాఖ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి కేజీబీవీ ఉపాధ్యాయురాలు పిట్టా జ్యోతికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. టీచర్స్ డే సందర్భంగా గురువారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతను స్థానిక అంకంరెడ్డి బుల్లిబాబు, ఎస్ఓ రాజేశ్వరి అభినందించారు.

శంఖవరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను సత్కరించారు.

ఆదిత్య యూనివర్సిటీలో...

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ఎస్ రమాశ్రీ, జి.సురేష్, డీన్ డోలా సంజయ్ పాల్గొన్నారు.


కాకినాడలో కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శ్రీవాణి

జగ్గంపేట: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ రంగారావును గురువారం ఘనంగా సత్కరించారు. తుమ్మలపల్లి రమేష్, వందన యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుని: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ, నేషనల్ మెగాస్టార్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఫౌండర్ పి.రుప్మాకరరావు, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కన్వీనర్ వీఎస్ఆర్ ఆంజనేయప్రసాద్, హెచ్ఎం మొగిలి నూకరత్నంలను ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజా అశోక్‌బాబు, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, బొప్పన రాము, అలయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురువులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

తుని రూరల్: మండలంలోని ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. గురువారం కాకినాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే పంతం నానాజీ, డీఈఓ పల్లి రమేష్, జీసీడీఓ ఉమా మహేశ్వరి తదితరులు అవార్డు గ్రహీతలను సత్కరించి, పురస్కారాలు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి, గిరిజన ఆశ్రమ పాఠశాల గణిత ఉపాధ్యాయిని శుభలక్ష్మి, ఏపీ మోడల్ స్కూల్ నుంచి డీవీవీ అశోక్ కుమార్, ఎస్సీ రెసిడెన్షియల్ నుంచి కె.పద్మసత్యవతి, మరువాడ ఎంపీపీ స్కూల్ హెచ్ఎం జయవరపు మురళీకృష్ణ ఉన్నారు.


తునిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిధులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

కిర్లంపూడి: మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. గురువారం కాకినాడలో జరిగిన గురు పూజోత్సవంలో కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా వారు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అవార్డులు పొందిన వారిలో కిర్లంపూడి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు బొడ్డేటి ధనలక్ష్మి, వేలంక హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.అర్జునరావు, తామరాడ జూనియర్ కళాశాల లెక్చరర్ దాడి చంద్రశేఖరరావు ఉన్నారు. కాగా స్థానిక మండల ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలను ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సత్కరించారు.


మురళీకృష్ణను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరిస్తున్న కలెక్టర్, ఎంపీ, డీఈఓలు